దాబాల్లో పోలీసుల తనిఖీలు



2



2

సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం

AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in



మత్తుకు దూరంగా ఉండాలి 2

26-6-2025 | NIZAMABAD / KAMAREDDY | PAGES -2


## అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులో

## ఏసీబీ సోదాల కలకలం




**అక్షరటుడే, బిచ్కుంద:** అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులో ఏసీబీ అధికారులు సోదాలు చేయడం కలకలం రేపింది. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం సలబత్‌పూర్ వద్ద మహారాష్ట్ర సరిహద్దులో రవాణా శాఖ ఆధ్వర్యంలో చెక్‌పోస్టు కొనసాగుతోంది. ఈ చెక్‌పోస్టులో బుధవారం అర్ధరాత్రి ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఏసీబీ డీఎస్పీ శేఖర్ ఆధ్వర్యంలో చెక్‌పోస్టులో సోదాలు చేశారు. ఆ సమయంలో విధుల్లో ఏఎంవీఐ కవితతో పాటు సిబ్బంది, ఇద్దరు ప్రైవేట్ వ్యక్తులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గతంలో సైతం ఈ చెక్‌పోస్ట్‌లో ఏసీబీ అధికారులు దాడులు చేశారు. రాత్రిపూట చెక్‌పోస్ట్ సిబ్బంది తనిఖీల పేరిట వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

### రూ. 91వేల స్వాధీనం

చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన డబ్బాలు, అక్కడ పనిచేసిన ఇద్దరి వద్ద లెక్కకు రాని రూ. 91వేలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం అర్ధరాత్రి నలుగురు వ్యక్తులు చెక్‌పోస్టు వద్ద అనధికారికంగా విధులు నిర్వహిస్తుండగా ఏసీబీ అధికారులను చూసి ఇద్దరు పారిపోయారు. మరో ఇద్దరిని అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పూర్తివివరాలు ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు ఆదేశాలనుసారం దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు.




## పదోన్నతి పొందిన ఎస్సైలకు సీపీ శుభాకాంక్షలు

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఏఎస్సై నుంచి ఎస్సైలుగా ఇద్దరు ప్రమోషన్లు పొందారు. ఈ సందర్భంగా వారు గురువారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్యను కలిశారు. ప్రమోషన్ పొందిన రుద్రూర్ పోలీస్ స్టేషన్ ఏఎస్సై రాజు, సీసీఎస్ ఏఎస్సై భీమ్‌రావులకు సీపీ శుభాకాంక్షలు తెలిపారు. పదోన్నతి వచ్చిన సందర్భంగా మరింత బాధ్యతలు విధులు నిర్వర్తించాలని.. పోలీస్‌శాఖపై గౌరవం పెంచాలని ఈ సందర్భంగా సీపీ వ్యాఖ్యానించారు.

అక్రమ రిజిస్ట్రేషన్లలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ప్రయోజనం ఉండటం లేదు. ప్రత్యేకించి పలువురు సబ్ రిజిస్ట్రార్లు అక్రమార్కులకు సహకారం అందిస్తుండటమే ఇందుకు కారణం. ముఖ్యంగా నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, డెత్ సర్టిఫికెట్లతో కొందరు డాక్యుమెంట్లు సృష్టిస్తున్నారు. పక్కాగా పరిశీలన చేసి ఇలాంటి రిజిస్ట్రేషన్లకు చెక్ పెట్టాల్సిన అధికారులే.. డబ్బులు తీసుకొని డాక్యుమెంట్లకు అనుమతించడంపై విమర్శలు వస్తున్నాయి.

-అక్షరటుడే, నిజామాబాద్




# ఫేక్ ఎఫ్ఎంసీతో రిజిస్ట్రేషన్లు..

- నకిలీ ప్రతాలు సృష్టిస్తున్న వైనం
- డాక్యుమెంట్ రైటర్ల ప్రధానపాత్ర
- ఇవేమీ పట్టించుకోకుండా రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తున్న సబ్ రిజిస్ట్రార్లు
- 15 రోజుల్లో వెలుగు చూసిన రెండు ఘటనలు

నిజామాబాద్ అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలో తాజాగా నకిలీ ఎఫ్ఎంసీ, డెత్ సర్టిఫికెట్లతో రిజిస్ట్రేషన్లు జరిపినా ఉదంతం వెలుగులోకి వచ్చింది. రెవెన్యూ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు సృష్టించి డాక్యుమెంట్లు తయారు చేశారు. కాగా.. సదరు సబ్ రిజిస్ట్రార్ పరిశీలన చేయకుండానే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయమై ఓ బాధిత కుటుంబం తాజాగా అధికారులకు ఫిర్యాదు చేసింది.

### ఈ రెండు ఉదాహరణలు

గత 15 రోజుల కిందట అర్సపల్లి శివారులో గల 300 గజాల స్థలానికి సంబంధించి ఓ రిజిస్ట్రేషన్ జరిగింది. కాగా సదరు డాక్యుమెంట్‌లో సమర్పించిన ఎఫ్ఎంసీ నకిలీది ఉన్నట్లు ఉన్నట్లు సమాచారం. ఖరీదైన స్థలాన్ని తమ పేరిట మార్చుకునేందుకు ఇలా దొడ్డిదారిలో నకిలీ ఎఫ్ఎంసీని సమర్పించారని తెలుస్తోంది. అలాగే వర్ని రోడ్డులోని మరో 500 గజాల ప్రాపర్టీకి సంబంధించి నెల రోజుల కిందట రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయింది. ఈ దస్తావేజుకు ఏకంగా నకిలీ ఎఫ్ఎంసీ, డెత్ సర్టిఫికెట్ జత చేసినట్లు సమాచారం. అయినప్పటికి ఇవేమీ లెక్క చేయకుండా సదరు సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి పెట్టడం కొసమెరుపు. ఇలాంటి రిజిస్ట్రేషన్లు ఎన్నో జరిగాయని తెలుస్తోంది.

### నకిలీలను సృష్టిస్తుంది ఎవరు

సాధారణంగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తీసుకోవాలంటే ఓ ప్రక్రియ ఉంటుంది. ఇందుకోసం రెవెన్యూ శాఖ అధికారులు పరిశీలన జరిపి అన్ని పక్కాగా ఉంటేనే సర్టిఫికెట్ జారీకి అనుమతి ఇస్తారు. ఈ క్రమంలో కొందరు దొడ్డిదారిలో సర్టిఫికెట్లు పొందేందుకు నకిలీలు తయారు చేసే ముఠాలను ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో పలువురు డాక్యుమెంట్ రైటర్లు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. గతంలోనే ఫ్యామిలీ మెంబర్, డెత్ సర్టిఫికెట్లు తీసుకున్నట్లు నకిలీవి సృష్టిస్తున్నారు. వీటి ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. అయినా సబ్ రిజిస్ట్రార్లు ఇవేమి పట్టించుకోకుండా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయడంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారి నిర్లక్ష్యం సర్వత్రా చర్చనీయాంశమైంది.

## ఎల్లారెడ్డి కాంగ్రెస్‌కు షాక్.. పార్టీకి సీడీసీ చైర్మన్ రాజీనామా

**అక్షరటుడే, కామారెడ్డి:** ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. పార్టీ సభ్యత్వానికి సదాశివనగర్ గాయత్రి షుగర్స్ షుగర్ కేన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) చైర్మన్ ఇర్షాదొద్దీన్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశాడు. ఈ మేరకు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావుకు లేఖ రాశారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పీఏల పెత్తనం, వారు ప్రవర్తించే తీరుతోనే రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నాడు. గత బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా ఎమ్మెల్యేగా మదన్ మోహన్ రావు గెలుపు కోసం కష్టపడ్డానని తెలిపాడు.

### అడుగడుగునా అవమానమే..

కొంతకాలంగా పార్టీకి పూర్తి విధేయులైన వారిని అడుగడుగునా అవమానపరుస్తూ విస్మరిస్తూ, పార్టీద్రోహులకు కీలకబాధ్యతలు అప్పగించడం తనను తీవ్రంగా బాధించిందన్నారు. ఇక్కడ మొత్తం ఎమ్మెల్యే పీఏలు రాజ్యమే నడుస్తోందని ఆవేదన వ్యక్తం చేశాడు. సొంత పార్టీ నేత షబ్బీర్ అలీని ఎవరైనా కలిస్తే.. తమ దగ్గరికి రావద్దని అంటున్నారని వాపోయాడు. అంతేకాకుండా తమ వాట్సాప్ గ్రూపులో నుండి తొలగిస్తున్నారని పేర్కొన్నాడు.



## బీడీ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** బీడీ కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కార్మిక వైద్యశాల సీనియర్ ఫార్మసిస్ట్ యాదగిరి అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ అనుమతి పొందిన పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు 1 నుంచి 4వ తరగతి వరకు రూ.వెయ్యి , 5 నుంచి 8 వరకు రూ.1,500, 9 నుంచి 10 వరకు రూ.2వేలు, ఇంటర్‌కు రూ. 3వేలు, డిగ్రీ, ఐటీఐ, ఇతర ప్రొఫెషనల్ కోర్సులకు రూ.6వేలు, బీటెక్, బీఏఎంఎస్, తదితర కోర్సులకు రూ.25వేల ఉపకార వేతనం లభిస్తుందన్నారు. బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు ఆగస్టు 31, ఆపై తరగతుల వారికి అక్టోబర్ 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువు ఉందన్నారు. వివరాలకు టోల్‌ఫ్రీ నంబర్లు 0120-66195405 040 29561297ను సంప్రదించాలన్నారు.

## కేంద్ర హోంమంత్రి పర్యటనకు పక్కాగా ఏర్పాట్లు



**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** కేంద్ర హోంమంత్రి అమిత్ షా జిల్లా పర్యటనకు వస్తున్నందున పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సీపీ సాయి చైతన్యతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 29న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నగరంలోని జాతీయ పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభోత్సవానికి వస్తున్నారని.. అనంతరం బైపాస్ చౌరస్తాలో డీఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించి అనంతరం పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో రైతుసభలో పాల్గొంటారని వివరించారు.

### ట్రాఫిక్ సమస్య తలెత్తవద్దు..

పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో జరిగే సభకు ట్రాఫిక్ ఇబ్బందుల రాకుండా చూడా లని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక హెలీకాప్టర్‌లో ఆయన జిల్లాకు వస్తున్నందున కలెక్టరేట్‌లో హెలీప్యాడ్ సిద్ధం చేయాలని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. ఎక్కడా కూడా లోటుపాట్లకు తావులేకుండా పర్యటకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్షలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ అధికారులు పాల్గొన్నారు.

## బడిబాటలో 13,214 ప్రవేశాలు

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో బడిబాటలో భాగంగా ఇప్పటివరకు 13,214 కొత్త విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని డీఈవో రాజు తెలిపారు. గురువారం ప్రకటన విడుదల చేశారు. జిల్లావ్యాప్తంగా హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఆయా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని.. స్వయం సహాయక సంఘాలు, అంగన్‌వాడీ కార్యకర్తల సహకారంతో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించినట్లు తెలిపారు. 1వ తరగతిలో 4,385, ప్రైవేట్ పాఠశాలల నుండి నుండి 4,120 కొత్త అడ్మిషన్లు, ప్రభుత్వ పాఠశాలల నుంచి 4,709 కొత్తగా అడ్మిషన్లు వచ్చాయన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలి

- కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్‌ను ప్రభుత్వం సీబీఐకి అప్పగించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్లయితే వెంటనే నిర్ణయం తీసుకోవాలన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల నేతలతో పాటు జడ్జీలు, సినీనటులు, పాత్రికేయుల ఫోన్లను సైతం ట్యాపింగ్ చేసిందని ఆరోపించారు. ఈ కేసును రాష్ట్ర సర్కారు కేసును సీబీఐ అప్పగించకపోతే తామే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు.

### పసుపు బోర్డును ప్రారంభించనున్న అమిత్ షా

పసుపు రైతుల దశాబ్దాల కలను బీజేపీ ప్రభుత్వం సాధ్యం చేసిందని కిషన్ రెడ్డి తెలిపారు. నిజామాబాద్ జిల్లాకు పసుపు బోర్డును మంజూ చేసిందని గుర్తు చేశారు. బోర్డు కేంద్ర కార్యాలయాన్ని ఇందూరులో ఈనెల 29న కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు చెప్పారు.

### పలు రాష్ట్రాలు పట్టుబట్టినా..

పసుపు బోర్డు కేంద్ర కార్యాలయం కోసం పలు రాష్ట్రాలు పట్టుబట్టాయని కేంద్ర మంత్రి తెలిపారు. అయినా మన రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లా కేంద్రానికి రావడం హర్షించదగ్గ విషయమన్నారు. పసుపు బోర్డు ప్రారంభోత్సవంతో పాటు నగరంలో నిర్వహించనున్న రైతు మహాసభకు పార్టీలకు అతీతంగా జిల్లాలోని రైతులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

### 29న మాజీ మంత్రి డి శ్రీనివాస్ విగ్రహావిష్కరణ

మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈనెల 29న నగరంలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆవిష్కరిస్తారని కిషన్ రెడ్డి తెలిపారు. జిల్లా అభివృద్ధిలో డి శ్రీనివాస్ పాత్ర మరవలేనిదన్నారు. ఆయన చివరి రోజుల్లో బీజేపీకి దగ్గరయ్యారని గుర్తు చేశారు. సమావేశంలో ఎంపీ ధర్మపురి అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, నిజామాబాద్ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి, జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణి, నేతలు మోహన్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

## సీఐగా నరహరి బాధ్యతల స్వీకరణ

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి పట్టణ సీఐగా నరహరి గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన చంద్రశేఖర్ రెడ్డి సిద్దిపేట ఇంటలిజెన్స్ విభాగానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలో లా అండ్ ఆర్డర్ సమస్య రాకుండా తనవంతు కృషి చేస్తానన్నారు. పట్టణంలో ట్రాఫిక్, ఇతర సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడతానని పేర్కొన్నారు. కామారెడ్డి పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌హెచ్‌ఓకు పట్టణ ఎస్సైలు, ఏఎస్సైలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.





## లోపాలు ఉండకూడదండా చూసుకోవాలి

**జీజీహెచ్‌ను తనిఖీ చేసిన స్టేట్ హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్ తనిఖీ**

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలతో పాటు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిని స్టేట్ హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్ తనిఖీ చేశారు. తెలంగాణలోనే పెద్ద కళాశాలల్లో నిజామాబాద్ మెడికల్ కళాశాలల్లో ఒక్కటని పేర్కొన్నారు. త్వరలో ఎంసీఐ తనిఖీలు ఉన్నందున ఎలాంటి లోపాలు ఉండకూడని ఆయన అధికారులను ఆదేశించారు.

### వార్డుల పరిశీలన

జీజీహెచ్‌లో వార్డులను, కళాశాలలో తరగతి గదులను డైరెక్టర్ పరిశీలించారు. వార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్, జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజశ్రీ, పెద్దోళ్ల నాగరాజు ఉన్నారు.



## విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

**అక్షరటుడే, ఆర్మూర్:** కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమ్మర్ పల్లి మండల వీడీసీ ఛైర్మన్ రామస్వామి, కోశాధికారి బుచ్చి మల్లయ్య, వినోద్, కళాశాల అధ్యాపకులు మధు కుమార్, వెంకటేష్, రాజకుమార్, గంగాధర్, వైష్ణవి, స్వాతి పాల్గొన్నారు.

## మెనూ ఖచ్చితంగా పాటించాలి



**అక్షరటుడే, నిజాంసాగర్:** ప్రభుత్వ పాఠశాలలో మెనూ ఖచ్చితంగా పాటించాలని ఎంపీడీవో గంగాధర్ అన్నారు. గురువారం మండలంలోని నర్సింగ్‌రావుపల్లి ప్రభుత్వ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. ఆయన వెంట జీపీ కార్యదర్శి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## అమిత్‌షా సభకు తరలిరావాలి




**అక్షరటుడే,బోధన్:** జిల్లా కేంద్రంలో ఈనెల 29న జరుగనున్న అమిత్‌షా రైతుసభకు కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు పసిలోటి గోపికిషన్ అన్నారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యాలయంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శిల్ప సుదర్శన్, సాలుర మండల అధ్యక్షుడు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి



**అక్షరటుడే, నిజాంసాగర్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని మహ్మద్‌నగర్ ఎంఈవో అమర్‌సింగ్ అన్నారు. గురువారం మండలంలోని కోన తండా, నడిమితాండ గిర్ని తండాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం లక్ష్మితో కలిసి తండాల్లో ఇంటింటికి తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, తదితర వసతులపై అవగాహన కల్పించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పాలని సూచించారు. ఆయన వెంట తండా పెద్దలు సవాయి సింగ్, తదితరులు ఉన్నారు.

## సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం



**అక్షరటుడే, గాంధారి:** గ్రామస్థులంతా కలిసి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని పెద్దగుజ్జుల్ తండాలో పది సీసీ కెమెరాలను ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమన్నారు. గ్రామంలోకి వచ్చే కొత్త వ్యక్తుల కదలికలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో సదాశివనగర్ సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై ఆంజనేయులు, గ్రామస్థులు హేమ్‌సింగ్, దేవిసింగ్, సవాయి తదితరులు పాల్గొన్నారు.




నిజామాబాద్ నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీ సాయి చైతన్య



కామారెడ్డి పట్టణంలో ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర

# మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ర్యాలీలు

ఉమ్మడిజిల్లాలో యాంటీ డ్రగ్స్ వీక్ సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య, కామారెడ్డిలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర ర్యాలీలను ప్రారంభించారు. అనంతరం వారు మట్లాడుతూ.. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ కారణంగా వచ్చే దుష్పరిణామాలపై వారు వివరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. – అక్షరటుడే, నెట్‌వర్క్




బాన్సువాడలో..



మోర్తాడ్‌లో..



భీమ్‌గల్‌లో..




నందిపేట్‌లో 2కే రన్‌ను ప్రారంభిస్తున్న పోలీసులు



బోధన్‌లో..

## పట్టణ సీఐ సేవలు అభినందనీయం



అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి సేవలు అభినందనీయమని కామారెడ్డి సబ్ డివిజనల్ ఏఎస్పీ చైతన్య రెడ్డి అన్నారు. సీఐ చంద్రశేఖర్ గురువారం బదిలీపై వెళ్తున్న సందర్భంగా పట్టణ పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో క్లాసిక్ గార్డెన్‌లో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఎస్పీ మాట్లాడుతూ.. కామారెడ్డి పట్టణంలో లా అండ్ ఆర్డర్ కంట్రోల్ చేయడంలో సీఐ సఫలమయ్యారన్నారు. శాంతిభద్రతల విషయంలో నిక్కచ్చిగా ఉన్నారని ప్రశంసించారు. సీఐ మాట్లాడుతూ.. 2019 ఆగస్టు నుంచి ఎక్కువ సంవత్సరాలు కామారెడ్డిలో పని చేశానన్నారు. ప్రజల మన్ననలు పొందడం సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం సీఐకి పోలీస్ సిబ్బంది, పట్టణ వ్యాపారులు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో కామారెడ్డి పట్టణ, దేవునిపల్లి ఎస్సైలు, ఏఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## డీవీకే ఆశయాలు కొనసాగించాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** విప్లవోద్యమ నాయకుడు, ఆదర్శ కమ్యూనిస్టు, ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ డీవీ కృష్ణ ఆశయాలు కొనసాగించాలని జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని డీవీకే నగర్‌లో డీవీకే 3వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు ఎం నరేందర్, నిజామాబాద్, బోధన్ డివిజన్ కార్యదర్శులు ఎం వెంకన్న, రాజేశ్వర్, నగర కార్యదర్శి ఎం సుధాకర్, సీపీఐ(ఎం.ఎల్) జిల్లా నాయకులు గంగాధర్, మల్లేష్, సిహెచ్ సాయన్న, కిషన్ మురళి, సాయన్న, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఫిజియోథెరపీ శిబిరం



**అక్షరటుడే, కామారెడ్డి గ్రామీణం:** దోమకొండ మండల కేంద్రంలోని శివరామ మందిర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవిత విద్యాకేంద్రంలో ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. వికలాంగ విద్యార్థులకు తల్లిదండ్రులు ఇంటివద్ద కూడా వ్యాయామాలు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రభావతి, సంతోష్‌కుమార్, నాగరాజు, ఏఈఆర్‌పీ దామోదర చారి తదితరులు ఉన్నారు.

## ఉపాధ్యాయులపై దాడి హేయనీయం

**అక్షరటుడే, కామారెడ్డి గ్రామీణం:** కామారెడ్డి పట్టణంలోని హనుమాన్ మందిర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బాలకృష్ణపై విద్యార్థి తండ్రి దాడి చేయడం హేయమైన చర్య అని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నతంగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులపై చేయి చేసుకోవడం మూర్ఖత్వమన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అసిస్టెంట్ అధ్యక్షుడు గోవర్ధన్, సుధాకర్, విష్ణువర్ధన్, వివిధ మండలాధ్యక్ష కార్యదర్శులు రమణ, హన్మాండ్లు, జిల్లా బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గురువారం పట్టణంలోని 3, 17 వ వార్డుల్లో పారిశుధ్య కార్యక్రమం, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం, సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు, ఇతర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, వార్డ్ ఆఫీసర్లు దినేష్, చక్రధర్ శానిటరీ జవాన్లు బాజన్న, శంకర్, మెప్మా ఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థిని అభినందించిన కలెక్టర్







**అక్షరటుడే, బాన్సువాడ:** మాదక ద్రవ్యాల నియంత్రణ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో బాన్సువాడకు చెందిన వాసవి హైస్కూల్ విద్యార్థి నిఖిల్‌గౌడ్ డివిజన్ స్థాయిలో మొదటి బహుమతి సాధించాడు. దీంతో గురువారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విద్యార్థిని అభినందించి, బహుమతి అందజేశారు. అలాగే ఉపాధ్యాయులు అభినందించారు.

### విద్యార్థిని అభినందించిన కలెక్టర్

**అక్షరటుడే, నిజాంసాగర్:** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ కార్యక్రమాల్లో భాగంగా ఇటీవల విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలు – నిర్మూలనతో కలిగే ప్రయోజనాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట ఆదర్శ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని నిషిత తృతీయ బహుమతి సాధించింది. దీంతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విద్యార్థినిని అభినందించి, బహుమతి అందజేశారు. విద్యార్థినితోపాటు గైడ్ టీచర్ జయపాల్‌ను అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

**అక్షరటుడే, ఆర్మూర్:** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆర్మూర్‌లోని పెర్కిట్ వద్ద గురువారం చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కోటార్మూర్‌నకు చెందిన మహేశ్ గురువారం ఉదయం పెర్కిట్ శివారులోని మహిళా ప్రాంగణంలో కుక్‌గా పనిచేసే తన భార్య లావణ్యను వదిలి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో పెర్కిట్ వద్ద ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో మామిడి మహేష్ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.



# దాబాల్లో పోలీస్ రైడ్స్..

▪ భారీగా మద్యం బాటిళ్ల స్వాధీనం ▪ పోలీసుల అదుపులో 71 మంది

**అక్షరటుడే, కామారెడ్డి :** జాతీయ రహదారి 161పై ఉన్న దాబాల్లో బుధవారం రాత్రి పోలీసులు స్పెషల్ రైడ్స్ చేపట్టారు. ఏకకాలంలో పలు దాబాల్లో దాడులు చేపట్టారు. ఏకంగా ఆరు దాబాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు గుర్తించారు. ఆరు దాబాల్లో 132 మద్యం బాటిళ్లతో పాటు 71 మంది మందు బాబులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**దాబాల్లో మద్యం అమ్మకాలు నేరం:** ఈ సందర్భంగా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం నేషనల్ హైవేపై ఉన్న దాబాల్లో మద్యం అమ్మకాలు చేయడం నేరమన్నారు. అలా చేస్తే దాబాల యజమానులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు మద్యం మత్తులో వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని ఎస్పీ తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలన్న ఉద్దేశంతో బుధవారం రాత్రి ఏకకాలంలో అన్ని దాబాలపై రైడ్ చేయడం జరిగిందన్నారు. ఇకపై ఎవరైనా దాబాల్లో మద్యం అమ్మకాలు చేపట్టినా, మద్యం సేవించినా చట్టరీత్యా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.